# నన్ను జైల్లో పెట్టరూ!

"నన్ను జైల్లో పెట్టరూ!"

కుర్చీలో కూర్చునే కునికిపాట్లు పడుతూన్న సుధాకర్ ఆ మాటవిని ఉలిక్కి పడి లేచి ఇటూ అటూ చూశాడు. ఎవ్వరూ కన్పించలేదు. మనిషి కనిపించకుండా మాట వినిపించిందేవిటి? ఎవరన్నారు ఆ మాట! ఎలా విన్నాడు తాను!

వెంటనే అర్థమయి సుధాకర్ నవ్వుకున్నాడు. అవును, తనకి కలే వచ్చింది. కల కాకపోతే ఏవిటి?

'నేను తప్పు చెయ్యలేదు' అనో

'పిల్లలు గలవాణ్ణి నన్ను జైల్లో పెట్టకండి' అనో.

'బుద్ధి గడ్డితింది. ఇంకెప్పుడూ చెయ్యను. ఈ మట్టుకి వదిలెయ్యండి' అనో - అంటారు. ఇలా ఎవరైనా వచ్చి 'నన్ను జైల్లో పెట్టరూ!' అంటూ ప్రత్యేకంగా ప్రార్థిస్తారా?

తన ఇరవై ఏళ్ళ సర్వీసులోనూ, ఆ మాట కొస్తే ఈ నలభై ఏళ్ళ జీవితంలోనూ ఇలాంటి మాట ఎప్పుడేనా విన్నాడా? వినడానికి అవకాశం ఉందని కాని, వింటే వినచ్చు అనిగాని అథమం అనుకున్నాడా?

అనుమానం లేదు. అది కలలో విన్నమాటే!

సుధాకర్ మళ్ళా ఓ మాటు నవ్వుకున్నాడు.

ఈ మారు కల కనినందుకూ కాదు.

నిజమేమోనని భ్రమపడినందుకూ కాదు.

స్టేషన్‌లో కూర్చుని, అందులో డ్యూటీ మీద యూనిఫారమ్‌లోకూడా ఉండి కునికిపాట్లు పడినందుకు.

అలాగని లేచి కూర్చున్నాడా?... ఉహుఁ!

ఉత్తినోటినే ఓమారు తృప్తిగా చప్పరించుకొని, జాగర్తగా సర్దుకొని, కుర్చీలోనే ఇంకొంచెం వెనక్కి వీలుగా జేరబడి, మళ్ళీ ఓ కునుకు తియ్యడానికి ప్రయత్నించాడు. కాని కునుకు పట్టేస్తేనా?

మళ్ళీ అదే మాట?

"నన్ను జైల్లో పెట్టరూ!" అని.

ఈ మాటు కొంచెం గట్టిగా, కాస్త స్ఫుటంగా మరింత దీనంగా. "ఇది కలలోదే పోనిద్దూ" అని సుధాకర్ తోసిపారెయ్యలేనంత బలంగా వినిపించింది.

సుధాకర్ గతుక్కుమన్నాడు.

ఎవరో బలంగా అంటున్నమాటే. సందేహం లేదు.

బద్ధకాన్నీ, కునికిపాట్లనీ గట్టిగా ఓమారు గదమాయించి, కళ్ళు విప్పి చూశాడు. ఎదురుగుండా దూరంలో ఏదో నీడ కదిలినట్లయింది. కుర్చీలోంచి లేచి నుంచుని మరీ చూశాడు.

అక్కడ ఆఫీసుకి ఎక్కివచ్చే ఆ అన్నిమెట్లకీ అవతల, టెలిఫోన్ స్తంభానికి దగ్గరిలో దాని నీడలోనే సన్నగా ఇమిడిపోయి నిలబడ్డ పాతికేళ్ళ ఓ చింకిగడ్డం రూపం.

మాసిపోయి మాగిళ్ళుకట్టి నుదురంతా కప్పేసిన బూడిద జుట్టుకీ, ఒత్తుగా బిరుసుగా నల్లగా మొహం అంతా పాకిన గెడ్డానికీ, మధ్య ఎక్కడో ఉండుండి కనిపిస్తూన్న రెండు నీరసపు కళ్ళూ, పూర్తిగా చిరిగి వాలికలయిపోయి పూర్వాశ్రమంలో అది ఒక చొక్కా అనైనా స్ఫురణ కలిగించని ఓ చింకిపాతలోంచి, ముడతలు పడి వెన్నుకు అంటుకుపోయి దాగుకొన్న కడుపూ, చిరుగులూ మాసికలూ కలగా పులగంగా వున్న ఓ ఒదులు ఇజారులోంచి నిలబడడానికి ఓపిక లేక ఒణికిపోతున్న రెండు ఈనుపుల్ల కాళ్ళూ – ఆ కళ్ళూ – కడుపూ – కాళ్ళూ.

ఇవేనా ఆ మాటలన్నది!

సుధాకర్ ఆ రూపంకేసి, ఇందాక తను విన్న మాటల్ని ప్రసారం చేసిన ఆ మానవ యంత్రంకేసి గుడ్లు అప్పగించి చూస్తూ వుండిపోయాడు.

అలా ఏమీ మాట్లాడకుండా చూస్తున్న ఇన్‌స్పెక్టరుగారితో "బాబూ! నేను దొంగని" అన్నాడు. రెండు చేతులూ ప్రాధేయపూర్వకంగా జాపుతూ.

వాడి ధోరణి చూస్తే సుధాకర్ కేం అర్థం కాలేదు.

అప్పటికప్పుడే ఆ అలికిడి అంతావిని లోపలినుంచి వచ్చి అరుగు చివర నిలబడ్డ రైటరూ, ఇద్దరు కానిస్టేబుల్స్‌లో, లావుగా ఉన్న కానిస్టేబిల్ "వీడెవడో పిచ్చివాడు సార్" అన్నాడు.

అది అందుకొని రైటరు "అ వు న వు ను" అన్నాడు.

"ఇదేం పిచ్చాసుపత్రికాదు, పోలీసు స్టేషను. ఫో .... ఫో" అన్నాడు మిగిలిన రెండో మిడిగుడ్ల కానిస్టేబిల్.

దాంతో వాడికి ఏడుపువచ్చినంత పని అయింది. దుఃఖంతో గొంతు అంతా పూడుకుపోయి దీనంగా ఆ ముగ్గురికేసీ ఓమారు చూసి. ఇన్‌స్పెక్టర్‌గారి వేపు జాలిగా తిరిగాడు. "నేను పిచ్చివాణ్ణికాదు" అనే అర్థం వచ్చేటట్లు తల అడ్డంగా ఊపుతూ. సుధాకర్ "లోపలికి పోండి" అని కళ్ళతో వాళ్ళ ముగ్గురికీ సంజ్ఞచేసి ఆ ఎముకలగూడు కుర్రాడిని పైనించి కిందికీ కిందనుంచిపైకీ ఎగాదిగా పరిశీలించసాగాడు. ఇరవై ఏళ్ళనుంచి సుధాకర్‌ని తన యూనిఫారమ్‌లో బంధించి, డ్యూటీ అనే గీతల మధ్య నడిపించి, అతని ఆలోచనల్నీ ఆవేశాల్నీ తన అదుపులో పెట్టుకొని వస్తూన్న "ఇన్‌స్పెక్టర్"లో కొద్దిగా సంచలనం రేగింది. ఎప్పుడూ లేంది "ఇన్‌స్పెక్టర్" కళవళ పడ్డాడు. పెట్టుకున్న బెల్టూ వేసుకున్న యూనిఫారమూ కాస్త వదులయినట్టు అనిపించ డంతో సుధాకర్ "హమ్మయ్య" అని స్వేచ్ఛగా ఒక్కమాటు గాలి పీల్చుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ కవచంలోంచి బైటపడి.

ఏమీ మాట్లాడకుండా నిలబడ్డ సుధాకర్‌తో "నేను పిచ్చివాణ్ణి కాదు బాబూ. నా మాట నమ్మండి – నిజంగా నేను దొంగని – దొంగతనం చేశాను," అన్నాడు గబగబా ఒక్కగుక్కలో, పిచ్చివాడని ఇన్‌స్పెక్టరుగారు ఎక్కడ అనుకొనిపోతారో అనే భయంతో.

సుధాకర్ తాపీగా ఓ నవ్వు నవ్వి "దొంగతనం చేశావా?... మంచిదే" అన్నాడు నిర్లిప్తంగా, అదేమంత ఘనకార్యం కాదనట్లు మొహం పెట్టి.

తను అన్నది వినడమే తడువుగా "ఆఁ?... ఏమిటి?.... దొంగతనమా?... ముందునడు జైలులోకి" అంటూ ఇన్‌స్పెక్టర్ నరసింహావతారం తాల్చి వెంటనే తనని జైలులో పెడతాడని ఆశించాడేమో. అలా అనకపోవడం సరిగదా నవ్వుతూ నిర్లిప్తంగా

తన మాటని తోసిపారెయ్యడంతో, ఆ బక్క కుర్రాడు బిక్కమొహం వేసి తెల్లబోయి సుధాకర్ కేసి చూస్తూ వుండిపోయాడు.

కాస్సేపు పోయాక సుధాకరే అన్నాడు "ఊ ..... దొంగతనం అంటే – ఏం చేశావు?" అని.

దాంతో ఆశ పొటమరించి "పావలా రొట్టి అండి.... ఇస్మాయిల్ దుకాణంలోంచి అండి ... వంతెన దగ్గర లేదండీ" అన్నాడు వాడు గబగబా.

ఈమారు సుధాకర్ పగలబడి నవ్వాడు. 'ఓశ్, రొట్టి దొంగతనంకూడా ఓ దొంగతనమేనా' అన్నట్టు.

ఇలా తను ఎంతో ఆశతో చెప్పింది ఇన్‌స్పెక్టర్ చాలా వేళాకోళంగా నవ్వుతూ తీసిపడెయ్యడం చూస్తే ఆ కుర్రాడికి ఉడుకుమోతుతనం వచ్చి ఏం చెయ్యలేక కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఏమిటనుకుంటున్నాడు ఈయన తన మతానికి? .... రొట్టె నెత్తుకురావడం పెద్దదొంగతనం కాదనా? ... ఓస్ రొట్టేనా అన్నట్టు నవ్వుతాడేమిటి? ... అది సంపాదించడం ఎంత కష్టమో ఈయనకేం తెలుసు. రొట్టె మాట అలావుంచి అణా వేరుశనగకాయలు, అర్ధణా మరమరాలు సంపాదించగలిగాడా తను ఎంత కష్టపడినా! అవీ దొరక్క మంచినీళ్ళు – కేవలం మునిసిపాలిటీ వాళ్ళ కుళాయి నీళ్ళుమాత్రం త్రాగి ఎన్ని రోజులు కడుపు నింపుకొనలేదు తను?

న్యాయంగా బ్రతకాలనీ, కష్టపడి జీవించాలనీ, అవసరం అయితే ముష్టి ఎత్తుకునేనా పొట్ట పోసుకోవాలి కాని మోసం, దొంగతనం లాంటివి చెయ్యకూడదనీ తను అనుకుని అనుకొనే కదా చివరికి విధిలేక ఆ రొట్టెను ఎత్తుకు వచ్చింది? అది ఎత్తుకు రావడానికి ముందు తను మనస్సులో ఎంత క్షోభ పడ్డాడు! ఎత్తుకు వచ్చాక దానిని దక్కించుకోవడంకోసం ఎంత యాతన పడ్డాడు! తరుము కొచ్చిన ఆ ఇస్మాయిల్ గాడి నౌకర్లతో ఎంత పెనుగులాడాడు ఎలాగేనా దాన్ని దక్కించుకుందాం అని! చివరికి రొట్టి తినడంపోయి అన్ని దెబ్బలూతిని, లోపల ఆకలి మంటకి, బైట దెబ్బల బాధ తోడయి, తను ఎంత నరకం అనుభవించాడో ఈయనకేం తెలుసు?

రొట్టేకదా అని తేలిగ్గా నవ్వేశాడు. హుఁ:– దీర్ఘంగా శ్వాసవదలి ఆ కుర్రవాడు ఉసూరుమంటూ నీరసంగా టెలిఫోను స్థంభానికి జేర్లపడ్డాడు. ఎండలో టెలిఫోను ఉందేమో ఒంటికి అది చుర్రుమని తగిలింది. కడుపులో ఆకలి మంట కంటేనా అనుకొని, ఆ స్థంభం కేసి హేళనగా చూసి నవ్వాడు వాడు. ఆ నవ్వు అర్థం టెలిఫోను

స్తంభానికయితే తెలియలేదుకాని మనిషి అయిన సుధాకరానికి మాత్రం అవగతం అయింది. అవడంలోనూ చాలా బలంగా హృదయాన్ని కుదిపేటంత తీవ్రంగా అయింది. ఆ నవ్వు వెనకాల ఎంతటి భయంకరమైన బాధ వుందో తెలిసిరావడంతో సుధాకర్ ఇందాకటిలాగ బాధ్యతా రహితంగానూ ధైర్యంగానూ నవ్వలేకపోయాడు. అంతేకాదు, ఆ కుర్రాడి దయనీయ పరిస్థితిని ఆసరాగా తీసుకుని ఏదో కాసేపు సరదాగా కాలక్షేపం చేద్దాం అనుకొన్న అతని ఆలోచనకూడా ఆగిపోయింది. దాని స్థానంలో వాడిమీద జాలీ, వాడి పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలనే తీవ్రమైన కోరికా బయలుదేరాయి. అందుకే కంఠంలో సౌమ్యత, మాటల్లో ఉదారత కనపరుస్తూ "అసలు నువ్వు ఎందుకు దొంగతనం చెయ్యాల్సి వచ్చింది? .... నీ పరిస్థితి ఏవిటి అంతా వివరంగా చెప్పు" అన్నాడు సుధాకర్.

వాడు సుధాకర్‌కేసి చూశాడుకాని ఆచూపులో అనుమానం తాలూకు నీలినీడ లేవో కన్పించాయి సుధాకర్‌కి. వాడికి తనమంచితనంమీద నమ్మకం కల్గించడంకోసం "ఇలారా - ఈ అరుగుమీద కూర్చో - ఎంతసేపని అలా నిలబడతావు" అన్నాడు.

వాడు కాస్సేపు తటపటాయించాడు.

"ఏం ఫరవాలేదు - ఇలారా"

నెమ్మదిగా మెట్లన్నీ ఎక్కివచ్చి సుధాకర్‌కి దణ్ణంపెట్టి అరుగుమీద కూచున్నాడు వాడు.

కుర్చీని గదిలోంచి అరుగుమీదకి తెచ్చుకుని వాడికి దగ్గర్లో వేసుకుంటూ "ఊ-ఈమారు కానియ్. నువ్వెవరు - నీకథేమిటి?" అన్నాడు సుధాకర్.

వాడింకా సుధాకర్‌కేసి అనుమానంగా చూశాడు. "తనని జైలులో పెట్టేదీ పెట్టనిదీ తేల్చకుండా ముందు తనకథ చెప్పమంటా దేవిటి?" అని.

వాడు తటపటాయించడం చూసి సుధాకరే సంభాషణ ప్రారంభించాడు "నీ పేరెమిటి?" అంటూ.

వాడు నెమ్మదిగా చెప్పాడు "నా పేరు సుబ్బడు" అని.

"నీకు తల్లీ తండ్రీ ఉన్నారా?"

"లేరండి, నే నింకో రెండు నెలలకి పుడతాననగా మా అయ్య పరారీ అయిపోయాడండి. ఆ తర్వాత అయిదారేళ్ళకి పోలీసోరు అడ్ని ఎక్కడో కాల్చి చంపేశారని సెప్పుకున్నారండి".

"అయ్యో పాపం! అసలు ఎందుకు పారిపోయాడో తెల్సా?"

"మా ఊరు జమీందారుగారింట్లో పనిచేసే వాడుట మా అయ్య. మరెందుకో కాని ఓ రోజున జమీందారుగారు తన భార్యని పిస్తోలుతో కాల్చి చంపేసి, అప్పుడే అక్కడి కొచ్చిన మా అయ్యని పిస్తోలు ఓ మాటు పట్టుకోరా ఇప్పుడే వస్తానని సెప్పి, ఎల్లి పోలీసుల్ని పట్టుకొచ్చి "ఇదిగో ఈడే నా భార్యని సంపా"డని మా అయ్యని సూపించారుటండి. దాంతో హడలెత్తిపోయి మా అయ్య పారిపోయాడట - అంతే అయిదేళ్ళ దాకా ఎవరికీ కనిపించలేదు. ఆ తర్వాత భద్రాచలం అడవుల్లో పోలీసోళ్ళకి దొరికాట్ట. పారిపోతూంటే ఆళ్ళు కాల్చేశారుటండి. మా అమ్మ సెపుతూ ఉండేది" అన్నాడు.

తను సర్వీసులో చేరిన కొత్తలో భద్రాచలంలో జరిగిన సరిగ్గా అలాంటి సంఘటనే జ్ఞాపకానికివచ్చి సుబ్బిడికేసి పరిశీలనగా ఓ మారు చూసి తలపంకించి "ఊ తర్వాత?" అన్నాడు సుధాకర్.

"మరి జమీందారుగారు ఎలా ఒప్పుకున్నారో, మా అమ్మకి ఎందుకు ఇష్టం అయిందో ఏమోకాని మా నాన్న పరారి అయినకాడనుంచీ నేనూ మా అమ్మా జమీందారుగారి లోగిట్లోనే ఊడిగంసేస్తూ వుండిపోయాం. ఆయనా మమ్మల్ని బాగానే సూసేవారు. కడుపునిండా కూడూ జమీందారుగారి అబ్బాయికి బిగుతై సినిగిపోయిన బట్టలూ-నాపనికూడా రైటుగానే వుండేదండి".

ఈ మాటలంటూ ఆ రోజులు తలుచుకుంటుంటే సుబ్బిడి లోతైన కళ్లు తృప్తితో మెరిశాయి. వాడోమాటు ఉత్తినోటినే గుటకేసి మళ్ళా చెప్పటం మొదలెట్టాడు.

"ఉన్నట్టుండి మా అమ్మ అమ్మోరుసోకి సచ్చిపోయిందండి. ఆ తర్వాత జమీందారుగారు నా మీద విసుక్కోవడం తిట్టడం కొట్టడం మొదిలెట్టాడు. "రంభలా ఉండేది అది - అటువంటి అమ్మ ఉండే యోగం లేదు నీకు -అందుకే పోయింది. పనికిమాలిన వెధవ్వ నువ్వ మిగిలావు - నువ్వ పోయి అది బతికున్నా బాగుండును" అనేవాడు.

అలాగే నన్ను నేనూ అనుకునేవాణ్ణి "అమ్మ ఉండి నేను చచ్చిపోతే బాగుండును" అని - కాని అదే ఆయన అంటే మాత్రం వళ్ళు మండేది. అప్పటికి పది పన్నెండేళ్లు ఉన్నాయేమో, మాట అంటేమాత్రం మహా పౌరుషంగా ఉండేది. ఇలా జమీందారుగారు అంటూ వుండడం చూసి కాబోలు ఓరోజున వాళ్ళ అబ్బాయి కూడా అన్నాడు. "నీ శనిమిాల్లే మిా అమ్మ పోయింది" అని. ఆ మట్టున నాకు కోపం

ఆగింది కాదు. జుట్టు వంచి ధబదబా బాదేశాను" - సుబ్బడు ఇలా చెబుతూంటే వాడి పెదిమలు ఉద్రేకంతో వణకడాన్ని సుధాకర్ గమనించాడు.

సుబ్బడు కొంతసేపటికికాని స్థిమితపడలేదు.

పక్కనున్న పంపుదగ్గరికి వెళ్ళి నాలుగు దోసిళ్ళ నీళ్ళు తాగి వచ్చాడు.

"మరి జమీందారు గారు నిన్ను కేకలెయ్యలేదూ" అన్నాడు సుధాకర్ తర్వాత ఏం జరిగిందో తెలుసుకోవాలనే ఉత్సాహంతో.

కేకలేసి ఊరుకోలేదండి. నన్ను ఇంట్లోంచి తరిమేశారు. అయిదారేళ్లు బస్సుల దగ్గర సామానులు మోసి, పొట్టపోసుకున్నాను. ఇంక అలాగే నా బతుకు బస్సుల దగ్గర గడిపేసుకుని వుందును. కాని -"

"ఊ - కాని?"

"ఓ రోజున ఓ డబ్బున్న ఆసామీ సామానులు బస్సులో పెట్టించుకుని, తీరా బస్సు కదలబోయే సమయంలో తన డబ్బున్న చిన్న సూటుకేసు కనిపించడం లేదనీ, అది నేనే ఎత్తుకు పోయానని అల్లరిచేసి,. ఇంకో బస్సుకి సామాను వేస్తున్న నన్ను పట్టుకుని గట్టిగా దెబ్బలు కొట్టి పోలీసోళ్ళకి అప్పగించాడు. నాకు తెలియదు మొర్రో అని ఎంత మొత్తుకున్నా ఎవరూ వినిపించుకోలేదు. "తెలియదు" అన్నప్పుడల్లా బూట్లతో తన్ని లాఠీతో కొట్టేవారు. అప్పుడు మీలాంటి దరమాత్ముడో పోలీసాయన 'తెలుసు అనరా దెబ్బలు తప్పుతాయి' అని ఓ చిట్కాసెవులో ఊదాడు. దాంతో నేనే తీశాననీ ఇప్పుడంతా నాదగ్గరలేదు. ఖర్చు అయిపోయిందనీ అబద్ధం ఆడినా-

అలా నెప్పడంలో దెబ్బలు తప్పినాయిగాని ఆరు మాసాలు ఖైదడిపోయింది. జైల్లో పెట్టాక రెండు మూడు రోజులు అన్నం నయించలేదు. తోటివాళ్ళంతా నవ్వుతూ ఊసులాడుకుంటూంటే నేను ఏడుస్తూ కూసునేవోడ్ని. రోజు రోజుకీ కొంచెం కొంచెం బెంగతగ్గి జైలులో రోజులు గడుపుతూండగా అక్కడో నేస్తం తగిలాడు నాకు. ఆడికీ నాలాగే ఎవరూ లేరంట. ఇరవై ఏళ్ళు వచ్చేదాక తిండిలేక మా ఇబ్బంది పడ్డాట్ట. ఓ మారెవళ్ళనో కొట్టి జైలుకి వచ్చినాడంట. అంతే - ఇంక మరి బైటికి పోవాలంటే భయమూ బెంగా బయల్దేరిందట. విడుదల అయిన నాలుగు రోజులకే మళ్ళీ ఎలాగో ఓ ఎదవపని చేసి జైలుకి వచ్చాడంట. అప్పటినుంచీ మద్దె మద్దె ఏ రెండు మూడు రోజులు అవతల ఉంటాడో, అంతేట. జైలంటే మా సుఖంగ తిండి బెంగ వుండదు అనేవోడు. ఆడి మాటలు వింటూంటే నాకు ఇసిత్రంగా అనిపించేది. నాకుమాత్రం ఎప్పుడెప్పుడు బైటికి పోదామా ఈ జైలు లోంచి అని వుండేది.

జైలులోంచి ఇడుదలై మామూలుగా బస్సుస్టాండుకి పోయేతలికి అక్కడంతా ఎవ్వారం మారిపోయింది. గవర్నమెంటోడు బస్సులన్నీ తీసేసుకున్నాడంట. నీలం చొక్కావోళ్ళే బస్సుల మీద సామానులు వెయ్యాలంట. "నేనూ ఓ నీలం చొక్కా సంపాదిస్తా" అన్నా. "అది సరిపోదోయ్! బిళ్ళ కావాలి" అన్నాడు అక్కడుండే వాడొకడు. "బిళ్ళలు ఎక్కడిస్తారు?" అని అడిగితే "నీ కివ్వరురా సుబ్బడూ! నువ్వు దొంగావిడి కదా! జైలుకి కూడా వెళ్ళివచ్చినావు" అన్నాడు స్టేండు గుమస్తా. అంతే ఆ తర్వాత పని కోసం ఎక్కడికి వెళ్ళినా "దొంగోడివి నీకు కూలేటి? పోరా!" అనేవాళ్ళే అందరూ. తిరిగిన సోటికే తిరుగుతూ, అడిగిన వోరినే అడుగుతూ కాళ్ళు అరిగేలా ఊరంతా తిరిగాను. నేను జైలు కెల్లిన సంగతి ఆ ఊళ్ళో అందరికీ తెలుసునేమో ఒక్కరూ నన్ను జేరనియ్యలేదు. కడుపు నకనకలాడిపోతూ వుంటే, తిండిలేక నీరసంతో నరాలన్నీ మెలితిరిగిపోయి యమ యాతనపడుతూ ఒట్టి మంచినీళ్లు మాత్రం తాగి వారం రోజులు గడిపాను ఆ ఊళ్లో. ఆ వారం రోజులలో ప్రతి క్షణం నేను జైల్లో కడుపునిండా అన్నం తిన్న సంగతి గుర్తుకొచ్చి కళ్ళమ్మట నీళ్ళు తిరిగి, మా నేస్తం చెప్పినట్లు జైలు బతుకే బాగుందే అనిపించేది. కాని ఆ జైలే పొట్ట కొట్టింది అనేది జ్ఞాపకం రావడంతో జైలు అంటే వల్లమాలినంత కోపం వచ్చేది. ఇలా వారం రోజులుండి ఇంక ఆ ఊళ్ళో వుంటే లాభంలేదని తిరిగి తిరిగి ఈ ఊరు చేరుకున్నా –

ఈ ఊళ్ళో "దొంగ" అని నన్నెవరూ అనలేదు కాని ఈ ఊరికి కొత్తవాడిని కావడం మూలాన ఎక్కడా నాకు పని దొరకలేదు. అలాగే దొరికినపుడు ఓ పావలా అర్ధాతోనే అన్నం కొనుక్కుని తింటూ, దొరకనప్పుడు కడుపులో కాళ్లు పెట్టుకుంటా, అంతకీ మరీ కష్టంఅయితే, బాగా చీకటిపడ్డాక గొంతుక మార్చి మొహం కనిపించకుండా గుడ్డకప్పుకుని మాధాకవళం అడుక్కునేవాణ్ణి.

ఈ మాటలు చెబుతూ సుబ్బడు ఎక్కి ఎక్కి ఏడవడం మొదలెట్టాడు. వాడి ఏడుపు చూసి సుధాకర్‌కి ఎంతో జాలేసింది. "ఏడవకు – ఏడవకు" అన్నాడు.

కొంచెంసేపయాక చిరిగినచొక్కా చేతుల్తో కళ్లు తుడుచుకుంటూ "రానురాను అలాబతకడం కూడా కష్టమైపోయింది. అన్నంలేక కడుపు మండిపోతూవుంటే పంపు నీళ్ళతో ఆ మంట చల్లార్చేవోడిని – నీరసంతో నరాలు మెలితిరిగిపోతూంటే గుడ్డపీలికలు గట్టిగా బిగించి ఆ బాధ తగ్గించుకొనేవాడిని. ఇలా ఎన్నిరకాలుగా ఎన్ని చేసినా ఆకలిమంట నన్ను కాల్చేయడంమాత్రం మానలేదు. ఇంక ఆఖరికి భరించలేక 'అన్నం దొరుకుతుంది జైలుకిపోతే' అని నిర్ణయం చేసుకొని, జైలుకి ఎలా పోవడమా అని ఆలోచించసాగాను.

ఎంత మందినో బతిమాలాను నన్ను జైలుకి పంపించమని. జైలుకి నన్ను పంపించడానికి వీలుగా ఎన్నిపనులు సెయ్యాలో అన్నీసేశాను. కానీనన్ను లెఖ్ఖసెయ్య లేదు. అంతా పిచ్చివాడు పోనిద్దూ అంటూ వేళాకోళం చేశారు. పిచ్చివాడు అన్నారంటే నేను పిచ్చివాడ్నా?"

అంటూ సుబ్బడు బావురు మన్నాడు.

సుధాకర్ బాధగా నిట్టూర్చాడు.

ఏడుస్తూనే సుబ్బడు తిరిగి చెప్పడం ప్రారంభించాడు. "మూడు రోజుల క్రితం ఎవరో ఒకాయనకి ఇంటినుంచి రిక్షాల దగ్గరికి బెడ్డింగు పట్టుకెళ్ళినందుకు ఓ అయిదు పైసలిచ్చాడు. వేరు సెనక్కాయలు కొనుక్కొని మంచినీళ్ళు తాగా. నిన్న అదీలేదు. ఇవాళ ఇంక ఆకలి అణుచుకోవడం నావల్ల కాకపోయింది. బజారులోంచి వస్తూంటే ఇస్మాయిల్ రొట్టెల దుకాణం కనిపించింది. బిస్కెట్లూ, రొట్టెలూ సీసాల్లో పెట్టాడు. పైనమాత్రం రెండు పావలా రొట్టెలు అందంగా బల్లమీద అమర్చాడు. నేను కొట్టు దగ్గరికివెళ్ళి వాటికేసి ఆబగాచూస్తూ నిలబడ్డాను. ఇస్మాయిల్ "ఛో" అని గట్టిగా నన్ను కసురుకున్నాడు.

నాకు వెంటనే ఒక ఆలోచన తట్టింది. ఆ రెండు రొట్టెలలో ఓ రొట్టె ఎత్తుకు పరిగెడితే – దొరక్కుండా పారిపోగలిగినా రొట్టెదక్కుతుంది. హాయిగాతిని మంచినీళ్ళు తాగచ్చు. దొరికినా, దొంగనని జైలుకి పంపిస్తాడు. ఎలాగైనా మా బాగే అని ఇస్మాయిల్ చూస్తుండగానే రొట్టె దొరకపుచ్చుకొని పరుగు లంకించుకున్నాను.

కాని పదిబారలు పరిగెట్టానో లేదో అతని నౌకర్లు నన్ను తరుముకుంటూ వచ్చి, పట్టుకుని, అప్పుడే తినబోతూన్న నా నోటి దగ్గరరొట్టి లాక్కుని పిచ్చికుక్కను బాధినట్లు బాదారుబాబూ పిచ్చికుక్కని బాదినట్లు –"

దుఃఖంతో కంఠం పూడుకుపోయి కొంచెం సేపటివరకూ సుబ్బడు ఏం మాట్లాడ లేకపోయాడు.

"కొట్టి లాక్కుంటే లాక్కున్నారు. నన్ను జైలుకైనా పంపించండి. నన్ను జైలుకి పంపించండిబాబూ, అంటూ ఆ నౌకర్లనీ ఇస్మాయిల్ నీ, ఆఖరికి అక్కడ తమాషా చూడడానికి మూగిన పెద్దల్నీ అందరినీ బతిమాలుకుని వాళ్ళందరి కాళ్ళూ పట్టుకొన్నాను. ఒక్కరూ నా గోల పట్టించుకోలేదు. "మాకిదేపనా? .... పో ... పో" అన్నారు అంతా. ఒక్క దరమాత్ముడుమాత్రం "పోలీస్ స్టేషనుకి పోరా ఈ సంగతి చెబితే వాళ్ళే పెడతారు నిన్ను జైల్లో" అంటూ సలహా చెప్పి సాయంచేశాడు ... దాంతో

పరిగెట్టుకుంటూ ఇలా వచ్చాను. బాబూ! .... ఇనస్పెట్టరు బాబూ నన్ను జైల్లో పెట్టరూ .... మీ కాళ్ళట్టుకుంటాను ... జైల్లో పెట్టి నన్ను రక్షించండి ఈ కడుపు మంటకి ఆగలేను" అంటూ వెక్కివెక్కి ఏడుస్తున్న సుబ్బడిని ఎలాఓదార్చాలో వాడికి ఎలా ఉపకారం చెయ్యాలో అకారణంగా ఏఫిర్యాదు ఏసాక్ష్యమూ లేకుండా ఎవ్వరినీ జైల్లో పెట్టకూడదు అనే న్యాయసూత్రాన్ని వాడికి ఎలా విడమరచి చెప్పాలో అర్థంకాక అలాగని వాడి కోరికని నిర్దాక్షిణ్యంగా తోసిపారెయ్యలేక ఏం చెయ్యడానికి తోచక నిస్సహాయంగా అమట్టునే నిలబడిపోయి ఉన్న ఇనస్పెక్టర్‌ని చూసి, ఆయన ఎక్కడ కాదు పొమ్మంటాడో అనే భయంతో, ఆయన కాళ్ళమీద చాపచుట్టగా పడిపోయి "నన్ను జైల్లో పెట్టరూ!" అన్నాడు జాలిగా.

అపరాధుల్ని శిక్షించడానికేకాని నిరపరాధుల్ని రక్షించడానికి అధికారంలేని ఆ ప్రభుత్వోద్యోగి సుధాకర్, ఆ మాటలకి కలవరపాటు చెందితేమాత్రం ఏం చెయ్యగలడూ – చెమ్మగిల్లిన కళ్ళతో కప్పిపుచ్చుకోవడం కోసం తను ముఖాన్ని పక్కకు తప్పించడం తప్ప.

(ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, 28-4-1967)

*